
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



సోమశిలలో 65.139 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 65.139 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 1,022 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 1,920, ఉత్తర కాలువకు 730, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,720
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,245
3 శాతం జీఎస్టీతో	రూ.5,402
నవర (8 గ్రా)	రూ.43,216

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.5 /22.5

జిల్లా వ్యాప్తంగా మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా, రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. గాలిలో తేమ 58 శాతం ఉంది.

న్యూస్‌రీల్

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షకు 12,088 మంది విద్యార్థులకు 10,804 మంది హాజరు కాగా, 1,284 మంది గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జగన్స్ డిగ్రీ కళాశాలలో ఒక్కో విద్యార్థి డిబార్ అయినట్లు తెలిపారు.

స్పందన రద్దు తెలియక అర్జీదారుల తాకిడి



కలెక్టరేట్‌కు చేరుకున్న అర్జీదారులు

నెల్లూరు (అర్బన్): ఎన్నికల కోడ్ నేపథ్యంలో కలెక్టరేట్‌లో జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసిన విషయం కలెక్టరేట్ అధికారులు ప్రకటించినప్పటికీ ఇది తెలియని అనేక మంది సోమవారం తమ సమస్యలపై అర్జీలతో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. స్పందన హాల్‌కు తాళం వేసి ఉండడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు నిరాశ చెందారు. పెద్ద సంఖ్యలో ప్రజలు డేటాఎంట్రీ ఆపరేటర్‌కు అర్జీలు ఇచ్చారు. మరికొంత మంది ఏఓకు అర్జీలు ఇచ్చారు. పలువురు ప్రజలు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు వస్తారేమోనని చెట్ల కింద, ఆరు బయట ఎదురు చూసిచూసి చివరికి ఇంటికి వెళ్లిపోయారు. ఎన్నికల కోడ్‌పూర్తయ్యే వరకు స్పందన జరగదని అధికారులు అర్జీదారులకు చెప్పారు.

15న హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష

నెల్లూరు (టౌన్): ఈ నెల 15న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష, 17న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ వరప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు పూర్వవిద్యార్థులు ఎవరైనా క్వాలిఫై కాకపోతే వారిని కూడా అనుమతించాలన్నారు. ఈ విద్యార్థుల నుంచి ఎలాంటి పరీక్ష ఫీజు వసూలు చేయరాదన్నారు. కళాశాలల ప్రిన్సిపల్స్ పూర్వ విద్యార్థులను పిలిపించి పరీక్షలకు అనుమతించాలన్నారు.

టీడీపీలోకి దారేదీ?


కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి టీడీపీలో ఎంట్రీకి దారులు మూసుకుపోతున్నాయి. ఆ పార్టీ నేతలు కోటంరెడ్డి రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కోటంరెడ్డి ఎపిసోడ్ ప్రారంభమైనప్పటి నుంచి నెల్లూరు రూరల్ నియోజకవర్గ నేతలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. రాబోయే ఎన్నికల్లో తాను టీడీపీ తరఫున పోటీ చేస్తానని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తనకు తానుగా బహిరంగంగా ప్రకటించుకున్నారు. అయితే ఇప్పటికే టీడీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జిగా ఉన్న అబ్దుల్ అజీజ్ శ్రీధర్‌రెడ్డికి వ్యతిరేకంగా శ్రేణులను కూడగడుతున్నారు.

- కోటంరెడ్డి ఎంట్రీ ప్రచారంపై భగ్గుమంటున్న రూరల్ తమ్ముళ్లు
- పార్టీ శ్రేణులను రెచ్చగొడుతున్న రూరల్ ఇన్‌చార్జి అజీజ్
- ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమీక్షలు, వ్యూహాలు
- శ్రీధర్‌రెడ్డిని పార్టీలో చేర్చుకుంటే తీవ్ర పరిణామాలంటూ అల్టిమేటం
- అవసరమైతే చంద్రబాబు వద్దే తేల్చుకుంటాం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని ఊహల్లో తేలియాడిపోతున్న అజీజ్‌కు కోటంరెడ్డి ఎపిసోడ్‌తో గొంతులో వెలక్కాయ పడినట్లు అయింది. వైఎస్సార్‌సీపీలో రెండు దఫాలు ఎమ్మెల్యేగా ఎన్నికై చక్రం తిప్పిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన రాజకీయాలతో గ్రాఫ్ కోల్పోయాడు. ఈ దఫా టికెట్ వచ్చే అవకాశాలు లేవని ముందుగానే పసిగట్టిన ఆయన టీడీపీ అధినేత చంద్రబాబుతో రహస్యంగా టచ్‌లోకి వెళ్లి టికెట్ కన్ఫర్మ్ చేసుకున్నాడని సమాచారం. అధికార పార్టీ నుంచి బయటకు వెళ్లిపోవడానికి అంతా సిద్ధం చేసుకున్నాక.. ఫోన్ ట్యాంపింగ్ హైడ్రామాతో రాజకీయ అలజడి సృష్టించారు. రానున్న ఎన్నికల్లో తాను టీడీపీ అభ్యర్థిగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని చెప్పడంతో టీడీపీలో ప్రకంపనలు మొదలయ్యాయి. టీడీపీ రూరల్ టికెట్ నాదే అనుకుంటూ ఇదే ఎమ్మెల్యే కోటంరెడ్డిపై, ప్రభుత్వం నోరుపారేసుకున్న అబ్దుల్ అజీజ్ షాక్‌కు గురయ్యాడు. అప్పటికప్పుడే పార్టీ పెద్దలతో కలిసి చంద్రబాబు వద్ద పంచాయితీ పెట్టాడు. చంద్రబాబు సైతం కోటంరెడ్డి రాకపై స్పష్టత ఇవ్వకపోవడంతో అజీజ్ మల్లగుల్లాలు పడుతున్నాడు. పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో పార్టీ కార్యాలయంలోనే సమావేశాలు నిర్వహించి అధిష్టానానికి అల్టిమేటం పంపిస్తున్నాడు.

కోటంరెడ్డి మౌనం.. అజీజ్ అల్లరి

నెల్లూరు రూరల్ టీడీపీ టికెట్ నాదేనంటూ బహిరంగంగానే ప్రకటించుకున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి అంతర్గత సమావేశాల్లోనూ ధీమాగా చెప్పుకుంటున్నాడు. అయితే మరో వైపు నెల్లూరు రూరల్ టీడీపీ ఇన్‌చార్జి, టికెట్ ఆశావహుడు అజీజ్ మాత్రం రచ్చరచ్చ చేస్తున్నాడు. కోటంరెడ్డి మాత్రం మౌనంగా తన ప్రయత్నాలు తాను చేసుకుంటూ పోతున్నాడు. సోదరుడు గిరిధర్‌రెడ్డితో వ్యాపార సంబంధాలు ఉన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ద్వారా కోటంరెడ్డి టికెట్ ప్రయత్నాలు చేస్తున్నాడు. మరోవైపు అజీజ్ కూడా చంద్రబాబు, లోకేశ్‌లతో జిల్లా పెద్దల ద్వారా మాట్లాడించారు. రాజకీయ వ్యూహాల్లో భాగంగా టీడీపీ అధిష్టాన పెద్దలు మాత్రం పైకి కోటంరెడ్డిని పార్టీలోకి తీసుకునే అవకాశం లేదని చెబుతున్నారు. టీడీపీ అధిష్టాన పెద్దలపై నమ్మకం లేని అజీజ్ మాత్రం కోటంరెడ్డికి వ్యతిరేకంగా పార్టీ శ్రేణులను సమీకరించి సమావేశాలు పెడుతున్నాడు.



నిప్పులు చెరిగిన తమ్ముళ్లు

ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో అబ్దుల్ అజీజ్ నేతృత్వంలో జరిగిన నెల్లూరు రూరల్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై ఆ పార్టీ శ్రేణులు నిప్పులు చెరిగాయి. మూడేన్నర ఏళ్ల కాలంగా పార్టీ నేతలను అష్టకష్టాలు పెట్టి, దాడులతో భయభ్రాంతులకు గురి చేసిన ఎమ్మెల్యేను పార్టీలోకి తీసుకోవద్దని ముక్తకంఠంతో తీర్మానం చేశారు. ఒకరిద్దరిని కాదు ఎంతో మంది నేతలను రౌడీమూకలతో చితక్కొట్టించిన ఎమ్మెల్యేను ఎలా తీసుకుంటారని? నేతలు, కార్యకర్తలు మండిపడ్డారు. ఓ ముస్లిం మహిళ అయితే ఏకంగా మా శవాలపై వెళ్లి పార్టీలోకి ఆహ్వానించడంటూ నేతలపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేసింది. టీడీపీకి చెందిన ఓ మైనార్టీ నేతను కొట్టించి వేధింపులకు గురి చేసిన విషయం అందరికీ తెలుసు. అలాంటి అరాచకవాదిని పార్టీలోకి ఎలా తీసుకువస్తారని, ఆయనతో కలిసి ఎలా నడవాలని ఆ మహిళ తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేసింది. కార్యకర్తల అభీష్టానానికి వ్యతిరేకంగా కోటంరెడ్డికి పార్టీలో రాచబాట వేస్తామంటే చూస్తూ ఊరుకోమని, అవసరమైతే చంద్రబాబు వద్దే పంచాయితీ తేల్చుకుంటామంటూ నేతలందరూ తీర్మానించారు. ఈ పరిస్థితులు చూస్తుంటే.. కోటంరెడ్డికి టీడీపీలోకి దారేది?.. అన్నట్లుగా ఉంది.

ప్రభుత్వ పథకాల అమలు భేష్

- జాతీయ పర్యవేక్షక కమిటీ సభ్యులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న జాతీయ పర్యవేక్షక కమిటీ సభ్యులు

నెల్లూరు(అర్బన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు అమలు తీరు జిల్లాలో చాలా బాగుందని జాతీయ పర్యవేక్షక కమిటీ సభ్యులు అంబటి శ్రీనివాసరావు, కిరణ్ అన్నారు. ఆ కమిటీ సభ్యులు జిల్లాలోని పలు గ్రామాల్లో 10 రోజుల పాటు పథకాల అమలు తీరును పరిశీలించిన అనంతరం సోమవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ చక్రధర్‌బాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో తాము పరిశీలించిన అంశాలను జాతీయ పర్యవేక్షక కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పింఛన్లు, ఉపాధి హామీ, స్వయం సహాయక సంఘాల పనితీరుపై లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడినట్లు తెలిపారు. లబ్ధిదారులు పథకాల అమలు తీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావు, హౌసింగ్ పీడీ వెంకటదాసు, జెడ్పీ సీఈఓ చిరంజీవి పాల్గొన్నారు.

సాధారణ కాన్పులు చేయాలి

- డీఎంహెచ్ఓ పెంచలయ్య
- ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలకు సూచన

నెల్లూరు(అర్బన్): ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధ్యమైనంత వరకు నార్మల్ కాన్పులు చేయాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య సూచించారు. సోమవారం స్థానిక సంతపేటలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖా కార్యాలయంలో ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సిజేరియన్ (ఆపరేషన్ చేసి బిడ్డను తీయడం) కేసులు పెరుగుతున్నాయని, ఇది తగదన్నారు. తప్పని పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ కాన్పులు చేయాలన్నారు. సిజేరియన్ కాన్పులు చేస్తే ఇక మీదట అందుకు సంబంధించిన కారణాలు తెలుపుతూ వైద్యశాఖకు వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి కేసులతో సంబంధం లేకుండా తక్షణ వైద్య సహాయం అందించాలన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తీసుకుని వచ్చి అడ్మిషన్ చేసే వారి వివరాలు గోప్యంగా ఉంచాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు సమీపంలో ఉన్న వ్యక్తులు ఎవరైనా ఆస్పత్రికి క్షతగాత్రుడిని తీసుకుని వస్తే ఆ వ్యక్తికి రూ.5 వేల నగదు బహుమతి కింద ఇస్తామన్నారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద ఉచిత సేవలందించడంలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ భాస్కర్, డెమో అధికారి శ్రీనివాసరావు, ఎస్ఓ సహన, డాక్టర్ సునీల్, హెచ్ఈఈఓ నరసింహారావు, హెల్త్ ఎడ్యుకేటర్ సునీత, సూపర్‌వైజర్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

వేగంగా భూసేకరణ ప్రక్రియ పూర్తి

- కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు (అర్బన్): జిల్లాలో మంజూరైన వివిధ ప్రాజెక్ట్‌లకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారులు, పోర్టులు, రైల్వే, పరిశ్రమల ప్రాజెక్ట్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి ప్రాజెక్ట్‌లకు కావాల్సిన భూములు సేకరించడంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రాజెక్ట్‌ల వారీగా నిర్దిష్టమైన గడువు నిర్ధారించుకుని అప్పట్లోగా భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. భూములు సేకరించడంతో పాటు అడ్వాన్స్ పొజిషన్ ఇవ్వడంలో ఆలస్యమవుతుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీఓలు ప్రత్యేక చర్యలు చేపట్టి జాప్యాన్ని నివారించాలన్నారు. భూ సేకరణ ప్రక్రియను పూర్తిచేసి సంబంధిత ప్రాజెక్ట్‌లకు అప్పగించిన భూ వివరాలను కూడా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, డీఆర్ఓ వెంకటనారాయణమ్మ, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, కరుణకుమారి, రామాయపట్నం పోర్టు లైజనింగ్ అధికారి ఐవీరెడ్డి, ఏపీఐఐసీ, ఆర్అండ్‌బీ, రైల్వే, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ఉదయగిరి సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్

- రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ ఆదేశాలు
- ఇందుకూరుపేట, రాపూరు సబ్ రిజిస్ట్రార్లపై విచారణ
- సాక్షి కథనంతో అధికారుల్లో అలజడి

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో అలజడి రేగింది. అవినీతికి పాల్పడిన అధికారిపై వేటు పడింది. సాక్షిలో సోమవారం 'ఎనీవేర్ అక్రమాలు' శీర్షికతో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు వచ్చిన కథనంపై స్పందించిన రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ విచారణ చేసి ఉదయగిరి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఎస్.వెంకటరమేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన వెంకటరమేష్ వింజమూరులో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఉదయగిరి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నాడు. ఉదయగిరి సబ్‌రిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని సీతారామపురంలో సర్వే నెంబర్ 1లో పదెకరాల ప్రభుత్వ భూమికి కోర్టు ఆదేశాలను అడ్డం పెట్టుకుని డాక్యుమెంట్ నంబర్ 2473/2022 ద్వారా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన విషయం తెలిసిందే. సదరు అక్రమార్కులు న్యాయస్థానాన్నే తప్పుదోవ పట్టించారు. వీరి ఒప్పందాల మేరకు రిజిస్ట్రేషన్ చేయాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ రిజిస్ట్రేషన్ సమయంలో ఆ భూమి పరిస్థితిని పరిశీలించాల్సిన బాధ్యత సబ్ రిజిస్ట్రార్‌దే. ఆర్ఓఆర్, వెబ్‌ల్యాండ్, వన్‌బీ అడంగళ్ పరిశీలించాలి. ఆన్‌లైన్ రికార్డుల్లో ప్రభుత్వ భూమి అని ఉన్నప్పటికీ ఆ సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేయడంతో ఉన్నతాధికారులు వేటు వేశారు.

ఎనీవేర్ అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ

ఇందుకూరుపేట సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో ఉండే భూమిని ఎనీవేర్ ద్వారా రాపూరులో రిజిస్ట్రేషన్ చేసి, ప్రభుత్వానికి రావాల్సిన స్టాంప్ డ్యూటీ ఆదాయానికి గండికొట్టారు. ఈ వ్యవహారంపై ఇందుకూరుపేట సబ్‌రిజిస్ట్రార్‌తో పాటు రాపూరు సబ్ రిజిస్ట్రార్‌పై ఉన్నతాధికారులు విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది. విచారణ తర్వాత వీరిపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మైనర్ల డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్



పట్టుబడిన మైనర్లకు నిబంధనల్ని వివరిస్తున్న నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ, ఆర్ఎస్ఐ

- భారీగా బైక్‌లు స్వాధీనం
- నేడు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

నెల్లూరు (క్రైమ్): మైనర్ల బైక్ డ్రైవింగ్‌పై పోలీసులు సోమవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. జిల్లాలో సగటున నెలకు ఒకరిద్దరు మైనర్లు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందగా పలువురు క్షతగాత్రులవుతున్నారు. వాహన నిబంధనలను పాటించకుండా బైక్‌ను మితిమీరిన వేగంతో నడుపుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాల గమనాన్ని అంచనా వేయకపోవడం, ముందు వాహనాన్ని అతిక్రమించాలని దూసుకెళుతుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. బాధిత కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపుతున్నారు. దీంతో మైనర్ల డ్రైవింగ్‌పై ఎస్పీ సీహెచ్ విజయారావు దృష్టి సారించారు. మైనర్, ట్రిపుల్ రైడింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ట్రాఫిక్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నగర డీఎస్పీ అబ్దుల్‌సుభాన్ నేతృత్వంలో నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మిద్దె నాగేశ్వరమ్మ, సౌత్ ట్రాఫిక్ ఆర్ఐ రమణారెడ్డి తమ సిబ్బందితో కలిసి నెల్లూరు నగరంలోని ప్రధాన కూడళ్లలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మైనర్, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారి వద్ద నుంచి బైక్‌లను భారీగా స్వాధీనం చేసుకుని పోలీసు కవాతు మైదానానికి తరలించారు. పట్టుబడిన వాహనాదారుల తల్లిదండ్రులకు మంగళవారం కౌన్సెలింగ్ చేసి బైక్‌లను అప్పగించనున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసు అధికారులు మాట్లాడుతూ మైనర్లు వాహనాల్ని నడుపొద్దని తెలిసినా చాలా మంది తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. మైనర్లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై సైతం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో సౌత్, నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ, ఆర్ఎస్ఐలు వై.రంగనాథగౌడ్, చంద్రమౌళి, తిరుమలరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెక్కీ వేసి.. దోచేశారు


- నగరంలోని న్యూమిలటరీ కాలనీలో దోపిడీ
- అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడిన దుండగులు
- చేతికి గ్లౌజ్‌లు, మొహానికి గుడ్డలు కట్టుకున్న వైనం
- తండ్రీ కుమార్తెను కట్టేసి.. నగలు, నగదుతో పరార్
- విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నెల్లూరు (క్రైమ్): ఇంట్లో ఎవరెవరు ఉంటారు? ఏ సమయంలో నిద్రిస్తారు? సీసీ కెమెరాలు ఎక్కడెక్కడ ఉన్నాయి? ఇలా అన్ని విషయాల కోసం పక్కా రెక్కీ వేశారు. అంతా అనుకూలంగా ఉండటంతో ఇంట్లోకి చొరబడి ఒంటరిగా ఉండే తండ్రి, కుమార్తెను కత్తులతో బెదిరించారు. చున్నీతో కట్టివేసి వారి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలతో పాటు బీరువాలో ఉన్న నగదును దోచుకుని తాపీగా వెళ్లిపోయారు. ఈ దోపిడీ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విభిన్నకోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

చైతన్యపురికాలనీ శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో సుందరరామిరెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయనకు ఎస్.వాణి, లక్ష్మీసుమేధలు సంతానం. కుమార్తెలిద్దరికీ వివాహం చేశారు. పెద్ద కుమార్తె భర్త నుంచి విడిపోయి తండ్రితో కలిసి ఉంటోంది. చిన్నకుమార్తెకు ప్రముఖ కాంట్రాక్టర్ సీహెచ్ ప్రసేన్‌కుమార్‌రెడ్డితో వివాహమైంది. వారికి ఒక కుమారుడు. వారు న్యూమిలటరీ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారిది డూప్లెక్స్ హౌస్. కుమారుడి చదువు, వ్యాపార రీత్యా వారు చెన్నైలో ఉంటున్నారు. కొన్ని రోజులు నెల్లూరులో కూడా ఉంటున్నారు. వారు లేని సమయంలో సుందరరామిరెడ్డి, వాణిలు చిన్నకుమార్తె ఇంట్లో రాత్రిళ్లు నిద్రిస్తుంటారు.



సంఘటనా స్థలంలో చర్చిస్తున్న ఏఎస్పీ, డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్



సుందరరామిరెడ్డి



తలుపులు పగులగొట్టిన దృశ్యం

దోపిడీ ఇలా...

ఇటీవల ప్రసేన్‌కుమార్‌రెడ్డి నెల్లూరుకు వచ్చారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం తిరిగి చెన్నై వెళ్లారు. అప్పటి నుంచి సుందరరామిరెడ్డి, వాణి ప్రతి రోజు రాత్రి అక్కడకు వెళ్లి నిద్రించేవారు. ఉదయం తమ ఇంటికి వెళ్లేవారు. 12వ తేదీ రాత్రి సైతం తండ్రి, కుమార్తె ఇద్దరు వెళ్లి చేరో గదిలో నిద్రపోయారు. 13వ తేదీ తెల్లవారుజామున సుమారు 2 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని నలుగురు దుండగులు చేతికి గ్లౌజ్‌లు, మొహానికి గుడ్డలు కట్టుకుని ప్రహరీ గోడ దూకారు. ఉత్తరం వైపునున్న తలుపు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. అలికిడితో నిద్ర నుంచి లేచిన సుందరరామిరెడ్డి తాను నిద్రిస్తున్న తలుపు తీయగా దుండగులు కత్తితో బెదిరించి అతని జేబులో ఉన్న రూ.3 వేల నగదు, సవర డైమండ్ రింగ్‌ను దోచుకున్నారు. దుండగుల్లో ఒకరు అతని మెడపై కత్తిపెట్టి అరవకుండా ఉంచగా మిగిలిన ముగ్గురు వాణి నిద్రిస్తున్న గది వద్దకు వెళ్లి తెరిచే ప్రయత్నం చేశారు. అది తెరుచుకోలేదు. ఆమె నిద్ర నుంచి తేరుకునే లోపే దుండగులు పడకగది తలుపు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఓ వ్యక్తి ఆమె మెడపై కత్తి పెట్టి చంపుతామని హిందీలో బెదిరించి ఆమె మెడలో ఉన్న 5 సవర్ల బంగారు గొలుసు, చేతికున్న ఐదున్నర సవర్ల నాలుగు బంగారు గాజులను తీసివ్వాలని కోరారు. తనకు హిందీ రాదని చెప్పడంతో తెలుగులో ఆమెను బెదిరించారు. దీంతో ఆమె బంగారు ఆభరణాలను తీసి అతని చేతికిచ్చింది. మిగిలిన ఇద్దరూ గదిలోని కప్‌బోర్డులు, బీరువాలను తెరిచి అందులో ఉన్న రూ.50 వేల పైచిలుకు నగదును దోచుకున్నారు. అనంతరం ఆమె చేతులు, కాళ్లు చున్నీతో కట్టివేశారు. డీవీఆర్ కోసం గాలించారు. ఇంతలో నాలుగో వ్యక్తి సుందరరామిరెడ్డిని ఆమె గదిలోకి తీసుకువచ్చారు. వారి సెల్‌ఫోన్లను తీసుకుని ఫ్లైట్ మోడ్‌లో పెట్టి ఇంట్లోని మెట్ల కింద పడవేశారు. అనంతరం పైగదిలోకి వెళ్లి నగదు, ఆభరణాల కోసం గాలించారు. అక్కడ ఏమీ దొరక్కపోవడంతో అక్కడ నుంచి గోడదూకి పరారయ్యారు.

112కు, ప్రసేన్‌రెడ్డికి సమాచారం

ఈ ఘటనతో భయాందోళనకు గురైన తండ్రి, కుమార్తె కొద్దిసేపటికి తేరుకుని ఫోన్లను వెతికి డయల్ 112కు, ప్రసేన్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన హుటాహుటిన నెల్లూరుకు చేరుకున్నారు. దోపిడీ విషయంపై సమాచారం అందుకున్న ఏఎస్పీ (క్రైమ్స్) ప్రసాద్, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె.నరసింహారావు సంఘటనా స్థలానికి చేరుకుని దోపిడీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. క్లూస్‌టీం సంఘటనా స్థలంలో వేలిముద్రలను సేకరించింది. డాగ్ స్క్వాడ్ దోపిడీ జరిగిన ఇంటి నుంచి సమీపంలోని కొన్ని ప్రాంతాల్లో కలియతిరిగి ఇంటి వద్దకు చేరుకుంది.

పనిచేయని సీసీ కెమెరాలు

దోపిడీ జరిగిన ఇంట్లో సీసీ కెమెరాలున్నాయి. అయితే నెలరోజులుగా అవి పనిచేయడం లేదు. వాటిని రెండు రోజుల్లో బాగు చేయించాలని ఇంటి యజమాని అనుకున్నారు. ఇంతలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. సీసీ కెమెరాలు పనిచేస్తూ ఉన్నట్లయితే నిందితుల ఆనవాళ్లను గుర్తుపట్టే అవకాశం ఉండేది.

నిందితులు 30 ఏళ్ల లోపువారే

బాధితులు తెలిపిన వివరాల మేరకు దోపిడీకి పాల్పడిన నలుగురు నిందితులు 25 నుంచి 30 ఏళ్లలోపు వారేనని తెలిసింది. తొలుత నిందితులు హిందీలో మాట్లాడారు. తమకు అర్థంకాదని బాధితులు చెప్పడంతో తెలుగులో మాట్లాడారు. దోపిడీ చేసింది నార్త్ గ్యాంగ్‌లని నమ్మించేందుకు ఇలా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. 2 గంటలకు ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు సుమారు 4 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లినట్లు తెలుస్తోంది. గుర్తు పట్టకుండా ఉండేందుకు దుండగులు చేతికి గ్లౌజ్‌లు, మొహాలకు గుడ్డలు కట్టుకున్నారు. బాధితురాలు వాణి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు.

కలకలం రేకెత్తించిన దోపిడీ

దోపిడీ ఘటన నెల్లూరు నగరంలో కలకలం రేకెత్తించింది. ఎస్పీ సీహెచ్ విజయారావు ఈ ఘటనపై ఆరా తీశారు. దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను త్వరితగతిన పట్టుకోవాలని ఆదేశించారు. దీంతో పోలీసులు విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఆ ఇంటి పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలు, సెల్‌ఫోన్ టవర్ డంప్‌లను సేకరిస్తున్నారు. వేదాయపాళెం పోలీసుస్టేషన్ పరిధిలో ఓ పాతనేరస్తుడు ఇదే తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు రికార్డుల్లో ఉండడంతో అతని కోసం గాలిస్తున్నారు. పోలీసు రికార్డుల్లో ఉన్న ఇతర నేరాలకు పాల్పడే వారికోసం సీసీఎస్ బృందం గాలిస్తోంది. రెండు, మూడు రోజుల్లో కేసు ఛేదిస్తామని పోలీసులు చెబుతున్నారు.



వాణి, ప్రసేన్‌కుమార్‌రెడ్డి నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

నమ్మకంగా ఉంటూ.. ఆభరణాలు కాజేసి..



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పక్కన ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు

- చోరీ కేసులో నిందితుడి అరెస్ట్
- రూ.12 లక్షల సొత్తు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): యజమానులకు నమ్మకంగా ఉంటూ బంగారు ఆభరణాలను కాజేసిన ఘటనలో నిందితుడిని నెల్లూరు చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి సోమవారం రాత్రి నెల్లూరులోని తన కార్యాలయంలో కేసు పూర్వాపరాలను వెల్లడించారు. ఆచారివీధికి చెందిన సంఘ్వి రాజేష్ జైన్ అదే ప్రాంతంలో సంఘ్వి గోల్డ్ పేరిట బంగారు ఆభరణాల విక్రయ దుకాణం నిర్వహిస్తున్నాడు. అందులో మధ్యపతివారి వీధికి చెందిన పాయసం లోకేశ్, నగరానికి చెందిన వెంకటేష్ మేనేజర్లుగా పనిచేస్తున్నారు. లోకేశ్ రోజూ లాకర్ల నుంచి బంగారు ఆభరణాలను తీసుకొచ్చి దుకాణంలో డిస్‌ప్లేలో ఉంచి సాయంత్రం తిరిగి వాటిని లాకర్‌లో పెట్టేవాడు. ఈనెల 9వ తేదీన రాజేష్ జైన్ డిస్‌ప్లేలో ఉంచిన ఆభరణాలను పరిశీలించాడు. అందులో రూ.12 లక్షల విలువచేసే 242.77 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. అక్కడ పనిచేస్తున్న వారిని ప్రశ్నించగా తమకు తెలియదని చెప్పారు. దీంతో బాధిత యజమాని బంగారు ఆభరణాలు మాయంపై ఈనెల 10వ తేదీన చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆభరణాలు మాయం వెనుక లోకేశ్ ప్రమేయమున్నట్లు అనుమానంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇన్‌స్పెక్టర్ ఎ.సురేంద్రబాబు కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న లోకేశ్ పరారీలో ఉండటంతో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం అతను ఇంట్లో ఉన్నాడన్న పక్కా సమాచారం ఇన్‌స్పెక్టర్‌కు అందింది. ప్రత్యేక బృందాలతో వెళ్లి లోకేశ్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించగా నేరం చేసినట్లు అంగీకరించడంతో అతడిని అరెస్ట్ చేశారు. 242.77 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. రోజుల వ్యవధిలోనే కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్, క్రైమ్ ఏఎస్‌ఐ శ్రీహరి, హెడ్‌కానిస్టేబుల్ సురేష్, నరసయ్య, కానిస్టేబుళ్లు శ్యామ్, వర్ధన్, మహమ్మద్, రాజా, రియాజ్ తదితరులను ఎస్పీ సీహెచ్ విజయారావు అభినందించి రివార్డులు ప్రకటించారని డీఎస్పీ తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.54
సన్నవి	: రూ.43
పండ్లు	: రూ.18

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	102
లేయర్ (లైవ్) :	75
బ్రాయిలర్ చికెన్ :	184
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	204
లేయర్ చికెన్ :	128

ఉద్యోగ దిక్సూచి

యువత ఉద్యోగాలు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నెల్లూరులో ఏర్పాటు చేసిన మోడల్ కెరీర్ సెంటర్ కొలువుల వేటలో ఉన్న వారికి ఎంతగానో ఉపయోగపడుతోంది. ఖరీదైన కోర్సులను అభ్యర్థులకు ఉచితంగా నేర్పిస్తుండటంతో వారు సులువుగా ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. కెరీర్ సెంటర్ ఇప్పటికే వేలాదిమంది భవితకు బంగారుబాటలు వేసింది.

- నెల్లూరులో మోడల్ కెరీర్ సెంటర్ నిర్వహణ
- 14 కంప్యూటర్లతో ల్యాబ్ ఏర్పాటు
- వివిధ రంగాల్లో ఉచితంగా శిక్షణ
- కెరీర్ సెంటర్‌తో యువత భవితకు బాటలు

నెల్లూరు(పొగతోట): ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న అభ్యర్థులకు మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)తో భరోసా దొరికింది. నెల్లూరులోని అయ్యప్పగుడి వద్ద ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ సెంటర్‌ను కొత్త భవనంలో అన్ని సౌకర్యాలతో 2022 సంవత్సరం ఏప్రిల్ 5వ తేదీన కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ప్రారంభించారు. కాగా అంతకుముందు కూడా అనేక అంశాల్లో అభ్యర్థులకు శిక్షణ ఇచ్చారు. ఎంసీసీలో 14 కంప్యూటర్లతో కూడిన ల్యాబ్ అందుబాటులో ఉంది. వివిధ అంశాలపై పుస్తకాలున్నాయి. ఎంతో ఖర్చుతో కూడుకున్న అధునాతన టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఇన్‌స్ట్రక్టర్లు ఉన్నారు. శిక్షణ పొందిన వారు బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించేందుకు వారు అన్ని చర్యలు తీసుకుంటారు. అభ్యర్థులకు అవసరమైన శిక్షణ ఇవ్వడంలో, ఉద్యోగావకాశాలు కల్పించడంలో నెల్లూరు ఎంసీసీ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని సంబంధిత అధికారులు తెలిపారు.

ఏం చేస్తారంటే..

ఎంసీసీలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంది. ఉపాధి కావాల్సిన వారికి ఇక్కడికి వస్తే 180 ప్రశ్నలను ఇస్తారు. వాటికి సమాధానాలు ఇస్తే వారికి ఏ రంగంలో అధికంగా ఆసక్తి ఉందో అధికారులు గుర్తిస్తారు. తర్వాత వారి చదువు, ఇతర అంశాల ఆధారంగా ఉద్యోగానికి అవసరమైన శిక్షణ ఇస్తారు. ఎక్సెల్, జావా, పైథాన్, అజూర్, సెక్యూరిటీ ఫండమెంటల్స్ తదితరాలు ఇందులో ఉన్నాయి. కంప్యూటర్స్‌కు సంబంధించి రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చయ్యే వివిధ కోర్సులను అభ్యర్థులకు ఉచితంగా నేర్పిస్తున్నారు. శిక్షణ పూర్తయ్యాక వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్నారు.



నెల్లూరులోని మోడల్ కెరీర్ సెంటర్

డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ

సెంటర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ (సీఈడీఎం) ద్వారా మైనార్టీలకు డ్రోన్ ఆపరేటింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 18 నుంచి 28 సంవత్సరాల వయసులోపు వారు శిక్షణ తీసుకోవచ్చు. మొదటి బ్యాచ్‌లో 26 మందికి శిక్షణ ఇచ్చి పైలట్లుగా ఉద్యోగావకాశాలు కల్పించారు. గతేడాది శిక్షణ తీసుకున్న వారికి దేశ రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి ఎంసీసీలో సర్టిఫికెట్లు అందజేశారు. మరో బ్యాచ్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు.



డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సతీష్‌రెడ్డి (ఫైల్)

అందుబాటులో ఖాళీల వివరాలు

ఎంసీసీలో నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ వెబ్‌సైట్‌ను వినియోగిస్తారు. www.ncs.gov.in ఇందులో అభ్యర్థులు తమ విద్యార్హత, ఇతర వివరాలను నమోదు చేయాలి. దేశంలోని పరిశ్రమలు, వ్యాపార సంస్థలు తదితర చోట్ల ఉన్న ఉద్యోగ ఖాళీలను వెబ్‌సైట్లో ఉంచుతారు. అభ్యర్థులు ఆసక్తి మేరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంకా వీరి కోసం జాబ్‌మేళాలు నిర్వహిస్తారు. స్థానికంగా ఉండే పరిశ్రమలు, వ్యాపార సంస్థలు తమ వద్ద ఉండే ఖాళీలకు అర్హులైన వారిని ఎంపిక చేసుకుంటున్నాయి.

ఎంతమందికి శిక్షణ ఇచ్చారంటే.. : 4,570	పరిశ్రమల్లో కల్పించిన ఉద్యోగాలు : 1,560	చెన్నైల్లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు : 530
బెంగళూరులో : 250	డ్రోన్ పైలట్ జాబ్‌లు : 26	వ్యాపార సంస్థల్లో కల్పించిన ఉద్యోగాలు : 700

ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు



జిల్లాలోని నిరుద్యోగులకు ఎంసీసీ ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఐటీ ల్యాబ్‌లో అధునాతన కంప్యూటర్లు ఉన్నాయి. వాటి ద్వారా వివిధ అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. మైనార్టీలకు డ్రోన్ ఆపరేటింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. మొదటి బ్యాచ్ పూర్తయింది. రెండో బ్యాచ్‌ను త్వరలో ప్రారంభిస్తాం.

– అందెల సురేష్‌కుమార్, జిల్లా ఉపాధి కల్పనాధికారి

శిక్షణ తీసుకున్నా.. జాబ్ వచ్చింది



ఎంటెక్ పూర్తి చేశాను. ఎంసీసీలో శిక్షణ తీసుకున్నా. నా విద్యార్హతకు తగిన ఉద్యోగం సాధించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. జాబ్ కోసం అవసరమైన వృత్తి నైపుణ్యాలు నేర్చుకున్నాను. ప్రస్తుతం సంవత్సరానికి రూ.3.50 లక్షల వేతనం వచ్చే ఉద్యోగం చేస్తున్నా.

– పి.యోగేష్, గూడూరు

డ్రోన్ పైలట్‌గా పనిచేస్తున్నా



ఎంబీఏ పూర్తి చేశాను. ఎంసీసీలో డ్రైన్ పైలట్‌గా శిక్షణ తీసుకున్నా. అధికారులు సర్టిఫికెట్ ఇచ్చి గుంటూరులో ఉద్యోగావకాశం కల్పించారు.

– షేక్ అబ్దుల్ రహమాన్, వెంకటేశ్వరపురం

‘నెల్లూరీయుల ఆదరణ బాగుంది’

- సినీ హీరో కిరణ్ అబ్బవరం
- నగరంలో ‘వినరో భాగ్యము విష్ణు కథ’ సినిమా యూనిట్ సందడి

నెల్లూరు సిటీ: ‘నెల్లూరీయులు నన్ను తమ ఇంట్లో అబ్బాయిలా ఆదరిస్తున్నారు. ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది.’ అని సినీ హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. వినరో భాగ్యము విష్ణు కథ సినిమా యూనిట్ సోమవారం నెల్లూరుకు విచ్చేసింది. ఈ సందర్భంగా లీలామహల్ థియేటర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించింది. కిరణ్ మాట్లాడుతూ ఎస్‌ఆర్ కళ్యాణ మండపం, సమ్మతమే చిత్ర విడుదల సందర్భంగా నెల్లూరుకు వచ్చానని, ఇక్కడి వారు తనను ఆదరించడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 18వ తేదీన ఈ చిత్రం విడుదల అవుతుందన్నారు. ఇప్పటికే పాటలు, టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. చిత్రంలో కామెడీ, యాక్షన్, సస్పెన్స్ తదితర అంశాలు ఉంటాయన్నారు. సమావేశంలో హీరోయిన్ కశ్మీర పరదేశి, యూవీ క్రియేషన్స్ మేనేజర్ శ్రీనివాసులురెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ కేవీ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిరణ్, చిత్రంలో హీరోయిన్ తదితరులు

వ్యక్తి ఆత్మహత్య



పవన్ కుమార్ మృతదేహం

పొదలకూరు: మండలంలోని బిరదవోలు గ్రామంలో పానీపూరి అమ్ముకుని జీవిస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎస్‌కే కరిముల్లా కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జలున్ జిల్లా జగమ్మాన్‌పూర్ మండలానికి చెందిన పవన్ కుమార్ (27)కు పదినెలల క్రితం వివాహం జరిగింది. భార్య దివ్యాంగురాలు. అతను మండలంలోని మరుపూరు గ్రామంలో ఉంటున్న తన సోదరి ఇంటి నుంచి బిరదవోలు గ్రామానికి వెళ్లి పానీపూరి విక్రయిస్తుంటాడు. కుటుంబ సమస్యల నేపథ్యంలో తన దుకాణంలోనే ఉరేసుకున్నాడు. అంతకుముందు ఉత్తరప్రదేశ్ లోని తన తల్లితో ఫోన్లో ఆవేశంగా కేకలు వేస్తూ మాట్లాడి.. ఆ తర్వాత ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న సీఐ జి.సంగమేశ్వరరావు ఎస్సైతో వెళ్లి ప్రాథమిక విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.